# “నీ కుమారుడు బ్రదికియున్నాడు”

# (4:46-54)

1977, ఆకురాలు కాలంలోని ఒక వారాంతంలో, హార్డింగ్ కాలేజీలో నా సీనియర్ సంవత్సరారంభమందు సెర్సీ ఆర్కన్‌సాస్‌నుండి ఫ్లోరెన్స్, అలబామాకు పలు కార్లనిండ విద్యార్థులు – సోల్ విన్నింగ్ (ఆత్మల సంపాదన) అనే వర్క్ షాపుకు తరలి వచ్చారు. ఆ వారాంతంలో నేను విని (ఆనందించిన) అనుభవించిన సంగతులన్నిటిలో మిషినెరీయైన ఓటిస్ గేట్‌వుడ్ యిచ్చిన ఉపన్యాసం కంటె ఎక్కువ ప్రభావమైనది ఏదీలేదు. అతడు వృద్ధుడు. మాలో అనేకులకు ఆయన హీరో. మిషన్ – ఫీల్డ్‌లో ముప్పై సంవత్సరాల పైబడిన కాలంలో ఎదురైన కష్టాలు శోధనలను గూర్చి మాట్లాడమని ఆయనను కోరాం. సువార్త వ్యాపకం అనే ప్రేమ ప్రయాసలో ఒంటరితనం, సహోదరులవలన వ్యతిరేకత, ప్రియమైనవారు, మరియు జత పనివారి మరణం, యింకా అతడనుభవించిన యితర శ్రమలను గూర్చి మాట్లాడాడు.

ఐరోపాలోని తన జీవిత కాలపు జ్ఞాపకాలను సహోదరులు గేట్‌వుడ్‌గారు పంచుకున్న ఆ రాత్రి మేము వింటూ ముగ్ధులమైపోయాం. అయితే నేను ఎక్కువగా జ్ఞాపకం ఉంచుకున్నది అతడు అప్పుడు ఉపయోగించిన లేఖన భాగం: యోహాను 4:46-54. ఇంటర్‌నేష్నల్ బైబిలు కాలేజి ప్రసిడెంటును, ఆ లెక్చర్ షిప్పుకు డైరెక్టర్ అయిన చార్లెస్ కాయిల్ సహోదరులు గేట్‌వుడ్‌ను ఆహ్వానించి, తాను మాట్లాడే సమయంలో ఈ లేఖన భాగాన్ని ఉపయోగించమని తెలిపాడు. “రాత్రిగుండా నడచిపోవడం” అని పిలువబడిన ఆ ప్రసంగాన్ని అప్పటినుండి నాకు ఎదురయ్యే కష్టాలకు ఆధారంగా చేసికొన్నాను. ఈ లేఖన భాగాన్ని ప్రజలతో వ్యక్తిగతమైన బైబిలు స్టడీస్‌లో పంచుకున్నాను. తమ జీవితాల్లో అతి కష్టమైన సమయాలను ఎదుర్కొన్న వ్యక్తుల కుటుంబాలకు సమాధుల వద్ద దీనిని చదివాను. ఇది మిక్కిలి రమ్యమైన శక్తివంతమైన, సవాలుతో కూడిన, ఆదరణతో కూడిన లేఖన భాగమైయుంది; మరియు అది ఈ పాఠానికి ఆధారమైయుంది.

## నిరాశ చెందిన తండ్రి (4:46, 47)

సమరయులతో ఆయన సంధింపు జరిగిపోయిన తరువాత, యేసు గలిలయకు తిరిగి వచ్చాడు. అక్కడ ఆయన బహు ఖ్యాతిగలవాడయ్యాడు. తాను తొలి అద్భుతం చేసిన కానాకు వచ్చినప్పుడు, రాజ్యానికి సంబంధించిన ఒక అధికారి ఆయన్ను కలుసుకొన్నాడు. అతడు తన కుమారుని ప్రాణం కొరకు బతిమాల వచ్చాడు. ముఖా ముఖిగా వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ మన విశ్వాస యాత్రలో మరొక ఆదర్శంగా

ఉపయోగపడుతుంది.

ఆ అధికారి యొక్క హోదా వివరాలు మనకు తెలియదు. చతుర్థాధిపతియైన హేరోదు పరిపాలనలో అతడు పని కలిగియున్నాడో లేదో మనకు తెలియదు. ఇతనిని చతుర్థాధి పతియైన హేరోదును హేరోదు అంతిపని పిలుస్తారు. బాప్తిస్మమిచ్చు యోహాను తల కొట్టించిన హేరోదు యితడే. ఏదియెలాగున్నా, (యేసు వద్దకు వచ్చిన యితడు) అధికారంలో ఉన్నవారితో సంబంధం కలిగినవాడైనందున, మంచి పలుకుబడి గలవాడై ఉన్నట్టు మనం ఊహించవచ్చు.

ఈ అధికారి యేసును కలిసికొన్న కానా, దాదాపు కపెర్నహోముకు ఇరవై మైళ్లు దూరం ఉండియుండవచ్చు.[1] జబ్బుపడియున్న బాలుడు అక్కడ ఉన్నాడు. యేసు కానాలో ఉన్న సంగతి ఆ మనుష్యుడు విన్నప్పుడు, తన కుమారుని స్వస్థపరచుటకై యేసును తన వెంట తోడుకొని వెళ్లడానికి అతడు వచ్చాడు, "తన కుమారుడు చావ సిద్ధమైయుండెను" (4:47). ఈ మనిషిని గూర్చి నాకు అంతగా తెలియదు, కాని యిది మాత్రం నాకు తెలుసు: తీవ్రంగా రోగియైయున్న కుమారుడు గల తండ్రికి లోకంలో యింకేమీ పట్టదు!

కొన్ని సంవత్సరాల క్రిందట, నా బిడ్డల్లో ఒకరికి నయముకాని రక్త సంబంధమైన అంటువ్యాధి సోకింది. యాంటిబయాటిక్స్ ఎన్నిసార్లు యిచ్చినా పని చేయలేదు. అసలు యింతకు కారణమేమో తెలిసికొనడానికి పిల్లల వైద్యుడు పరీక్ష కొరకు మరలా రక్తం తీయించాడు. మాకెవరు చెప్పలేదు గాని రక్తపు కాన్సర్ కొరకు పరిశోధనలు జరుగుతున్నాయని మాకు తెలిసింది. అది నా జీవితంలో బహు దీర్ఘమైన దినమైయుంది. ఆ దినమంతా ఏమేమి జరిగినా, అల్పమైన వివరాలు మాత్రమే వచ్చాయి. నాకు ఆ రోజున పట్టిందంతా నా బిడ్డ ఆరోగ్యమే. ఆరోగ్య పరీక్షలు ఆమెకు బాగౌతుందని వచ్చాయి. నేను నెమ్మదిపడ్డాను కాని, ఆ రోజున లోకమంతా "ఎటుపోయిందో" కూడా నాకు పట్టలేదు, ఆమె ప్రాణం పోతుందేమోనని నేను భయపడ్డాను. ఆ రోజు నాకు మరువ రానిదై ఉంటుంది.

లేఖనంలో ఉన్న తండ్రి హేరోదు కొరకు పని చేసినట్టున్నాడు. ఆ విధంగా అతడు రాజకీయమైన ఉద్యోగియై ఉండవచ్చు. దీనికి సంబంధించిన మార్కు సువార్తలో హేరోదీయులు యేసును చంప ప్రయత్నంలో ఉన్నట్టు సూచింపబడింది. సబ్బాతు దినాన ఊచ చెయ్యిగల యొకని యేసు బాగుచేసిన సందర్భంలో, మనం యిలా చదువుతాం: "పరిసయ్యులు వెలుపలికి పోయి వెంటనే **హేరోదీయులతో** కలిసికొని, ఆయననేలాగు సంహరింతుమా యని ఆయనకు విరోధముగా ఆలోచన చేసిరి" (మార్కు 3:6; ఒత్తి పలకడం నాది). ఈ కథలోని తండ్రి ఏదో ఒక సమయంలో యేసును చంప వెదకినవారిలో ఉండే అవకాశముంది. ఏదియెలాగున్నా, అది రాజకీయం; కుమారుడు చావ సిద్ధమై యున్నప్పుడు రాజకీయం పట్టింపుకు రాదు!

1981లో ఆలాటి ఒక సంఘటన జరిగింది. అమెరికా ప్రసిడెంట్ అయిన రోనాల్డ్ రీగన్ తుపాకీతో కాల్చబడగా, హాస్పిటల్‌కు తరలింపబడ్డాడు. వెంటనే అతడు ఆపరేషన్‌కు సిద్ధపరచబడి ఆపరేషన్ గదిలోనికి కొనిపోబడ్డాడు. సర్జన్ను చూడగానే, తనకు తగిలించి ఉన్న ప్రాణవాయువు మాస్కును తొలిగించుకొని, "నీవు రిపబ్లికనువా?" అని వింతైన

సరదాగా ప్రశ్నించాడట. ఆ ప్రాణవాయువు మాస్కును తగిలించుకోమని చెప్పి, "ప్రసిడెంట్‌గారూ, నేడు మనమందరం రిపబ్లికన్స్‌మే" అని ఆ సర్జన్ ప్రత్యుత్తరమిచ్చాడట. ప్రాణంపోయేలా ఉంటే, పార్టీకి సంబంధించని చర్చలు వెనుకకు అంతర్థానమైపోతాయి.

ఈ లేఖన భాగానికి మనం వెళ్లక ముందు "ఈ తండ్రిని గూర్చి యింకో పాయింటు" చెప్పవలసియుంటుంది. అతడు యేసు వద్దకు వచ్చినప్పుడు, ఆయన అతనితో వచ్చి తన కుమారుని స్వస్థపరచుమని వేడుకొనెను. గ్రీకులోని పదం అసంపూర్ణమైన క్రియ లేక అసమాపక క్రియ, అంటే కార్యాన్ని కొనసాగించేదని దాని భావం. ప్రజల కన్నులలో ఈ అధికారి ముఖ్యమైనవాడై ఉండవచ్చు. అయితే తన కుమారుని ప్రాణాన్ని దక్కించమని అతడు యేసును బతిమాలుకున్నాడు! ఇదే అతని కడవరి నిరీక్షణ. గనుక అతడు తన అతిశయాన్ని వదలుకొని వివాదాస్పదమైనవాడును, దరిద్రుడునైన ఆ రబ్బీని తన కుమారుని ప్రాణ రక్షణకై వేడుకొంటున్నాడు.

## అక్కరగల రక్షకుడు (4:48-50)

ఆ బిడ్డ యొక్క తండ్రి విన్నపాన్ని యేసు విన్నప్పుడు, తన చుట్టునున్న జనులను ఆయన గద్దించడం ఆయన తొలి ప్రత్యుత్తరం: "యేసు – సూచక క్రియలను మహత్కార్య ములను చూడకుంటే మీరెంతమాత్రము నమ్మరని అతనితో చెప్పెను" (4:48). ఆయన ఆకస్మికపు ప్రత్యుత్తరం మనలను దిగ్భ్రమపరుస్తుంది. దయ, స్థిరత్వం, నిరీక్షణ ప్రభువునుండి వస్తాయని మనం కనిపెడతాం. దానికి బదులు, గద్దింపు వచ్చింది. బహు సాధారణమైన నకిలీ విశ్వాసాలతో సంతృప్తి పొందవద్దని ఆయన జనులను నిర్బంధం చేస్తూ, నిజమైన విశ్వాసంవైపు యేసు వారిని కదిలిస్తున్నట్టు మరోసారి చూస్తాం.[2]

ఇతరులకు సహాయం చేస్తున్నామన్న పేరుతో మనం ఏమి చేస్తున్నామో ప్రభువైన యేసు యొక్క గద్దింపు ఆలోచించేలా మనలను చేస్తుంది. సత్యాన్ని వెంబడించడంలో మనం సమర్పణ కలిగియున్నామా లేక సౌఖ్యంగా ఉండజూస్తున్నామా? జనులు విశ్వాసులై ఉండాలని అక్కర చూపుతున్నామా లేక ఉద్వేగపు అసౌకర్యాల్లోనుండి తప్పించడానికి అక్కర కలిగియున్నామా? హెన్రీ నౌయెన్ యొక్క ఈ క్రింది మాటలవలన నేను తరచుగా గద్దింపబడతాను:

> సేవకుడు బాధను తొలిగించే ప్రాథమిక పని కలిగియున్న వైద్యుడు కాదు.
>
> తప్పుడు కారణాలవలన ప్రజలు బాధపడకుండ నిరోధించడం సేవకుని యొక్క ప్రధానమైన పనియై ఉండవచ్చు. తమ జీవితాలను తప్పు ఊహల మీద ఆధారం చేసికొనినందున అనేకులు బాధపడతారు. ఈ ఊహ ఏమంటే – భయము గాని లేక ఒంటరితనం గాని లేకయు, కలత గాని సందేహం గాని లేకుండా ఉండాలనేదే. మన మానవ పరిస్థితి పూర్ణం కావడానికి ఉంచబడిన గాయాలని మనం గ్రహించినప్పుడు మాత్రమే అవి నిర్వహింపబడతాయి. గనుక పరిచర్య బహు ఆదరణతో కూడిన సేవయై ఉంది. అమరత్వము, మొత్తం అనే భ్రమలచే ప్రజలు జీవించకుండేలా చేస్తుంది. వారు మర్త్యులు, విరిగినవారు అనే విషయాన్ని యితరులకు అది జ్ఞాపకం చేస్తూ ఉంటుంది. కాని ఈ పరిస్థితి యొక్క గుర్తింపుతో లిబరిస్టులు ఆరంభిస్తారు.[3]

బాధపడుతున్న తండ్రిని గూర్చియు, చావ సిద్ధంగా ఉన్న అతని కుమారుని గూర్చియు యేసు అక్కర గలవాడైయున్నట్టు నేను నమ్ముతున్నా. కాని దేవునితో వారికి ఉండవలసిన సంబంధాన్ని గూర్చి ఆయన మరి ఎక్కువైన అక్కర కలవాడైయున్నట్టు నేను నమ్ముతున్నా. ఆ బిడ్డను స్వస్థపరచాలని, అతని తండ్రి హృదయం పగలకుండాలని ప్రభువు కోరి నట్టున్నాడు, నశించిన జనులు రక్షింపబడాలని ఆయన మరి ఎక్కువగా కోరినట్టున్నాడు. ఆనాడు ఆ అధికారి జీవితంలో భౌతికమైన మరణమునుండి విడిపించడం కంటె, అతనికి దేవుడే అవసరమైనట్టు చూచాడు! చావ సిద్ధంగా ఉన్న తన కుమారుని స్థితి అతని శ్రేష్ఠమైన అవసరతను చూచుటకు అవకాశాన్ని యిచ్చినట్టు యేసు చూడగలిగాడు.

ఈ కథ కొనసాగింపక ముందు, ఈ క్షణమందు మనలను ఒత్తిడి చేస్తున్న మిక్కిలి ఎక్కువైన అక్కర ఏమైయుందని మనలను మనమే అడుగుకోవాలి. తత్ క్షణమే నీ మనస్సులో భారముగానున్న అక్కర ఏది? అది నీకు ప్రాముఖ్యమైనదైనా, అది నీకు అతి మిక్కిలి పెద్దదైన అవసరత కాకపోవచ్చు. ఏదియెలాగున్నా, ఆ విషయమే నీ అత్యున్నతమైన అవసరతను నీవు గుర్తించేలా అది సహాయపడవచ్చు – దేవునికి నీ హృదయం తెరవడం! (అదే నీ అత్యున్నతమైన అవసరత).

యేసు తన శ్రోతలను గద్దించడం మాటిమాటికి అతని విన్నపంవలన అంతరాయం కలిగింపబడుతుంది: "ప్రభువా, నా కుమారుడు చావక మునుపే రమ్మని" ఆ ప్రధాని ఆయనను వేడుకొంటున్నాడు (4:49). ఈ సమయంలో అతడు తన కుమారుని విషయమై మాట్లాడడంలో కొంత ప్రాముఖ్యత ఉండియుండవచ్చు. ఇక్కడ అతడు *paidion* అనే గ్రీకు పదాన్ని వినియోగించాడు, అంటే, "నా చిన్న బాలుడు" అని అర్థం. సాధారణ రూపంలో *huios* "నా కుమారుడు" అనే పదం వాడలేదు. ఇది 46, 47 వచనాల్లో కన్పిస్తుంది. ఏ అంతస్థుగాని, ఏ బిరుదులు గాని యిక్కడ సూచింపబడలేదు. తన "చిన్న బాలుని" ప్రాణం కొరకు విన్నవించుకొంటున్న హృదయం పగిలినవాని పరితాపకరమైన సంఘటనయై ఉంది.

స్వస్థపరచు మాటలు చివరికి వచ్చినప్పుడు, అవి సాధారణమైనవిగాను ముక్కు సూటియైనవిగాను ఉన్నాయి. యేసు – "నీవు వెళ్లుము నీ కుమారుడు బ్రదికియున్నాడని" అతనితో చెప్పాడు (4:50). తన పనిని సాధించుకొనడానికి ఆయన కపెర్నహోమునకు ఇరవై మైళ్లు వెళ్లనక్కర లేకపోయింది. ఆయన కేవలం మాట మాత్రమే సెలవియ్యగా, ఆ బాలుడు స్వస్థపరచబడ్డాడు.

## విశ్వాసపు రాత్రి (4:50-54)

ప్రభువైన యేసునుండి వచ్చిన మాటతో, ఆ తండ్రి యొక్క భయకంపితమైన స్థితి అంతరించింది లేక అయ్యిందా? తన చిన్న బాలుడు స్వస్థత పొందినట్టు తన సొంత కండ్లతో చూచుకొనడానికి ఆ బిడ్డనుండి అతన్ని ఇరవై మైళ్లు వేరుచేశాయి. ఏదో యొక కారణంవలన (ఆలస్యమైనందున[4] లేక ఆ మనుష్యుడు అలసియున్నందున) ఆ రాత్రి యింటికి తిరిగి వెళ్లలేకపోయాడు. తన కుమారుడు బాగుపడ్డాడనియు యిప్పుడు

బాగున్నాడనియు తెలుపడానికి మరునాడు తనకు ఎదురు వచ్చి తనను కలిసికొన్న తన దాసుల మూలంగా విషయాన్ని తెలిసికొన్నాడు. బాగుపడిన సమయాన్ని గూర్చి అతడు తెలిసికొన గోరినప్పుడు, "వారు – నిన్న ఒంటిగంటకు జ్వరము వానిని విడిచెనని అతనితో చెప్పిరి" (4:52), "–నీ కుమారుడు బ్రదికియున్నాడని" యేసు అతనితో చెప్పిన గంట అదే అని తండ్రి తెలిసికొనెను.

ఈ కథలో నన్ను ఆకర్షించే వివరమేమంటే, తన కుమారుడు బాగుపడ్డాడనే వాగ్దానానికిని, ఆ అద్భుతం జరిగినట్లు స్థిరపరచడానికిని మధ్య ఆ బాలుని తండ్రి ఒక రాత్రి నిద్రపోవలసి వచ్చింది. ఓటిస్ గేట్‌వుడ్ 1977లో శక్తివంతమైన ప్రసంగంలో ఈ విషయం తెలియజేశాడు. "ఆ మనుష్యుడు యేసు తనతో చెప్పిన మాట నమ్మి వెళ్లిపోయెను" (4:50). "ఆ మనుష్యుడు యేసుని మాటను బట్టి ఆయనను అంగీకరించి వెళ్లిపోయెను" (NIV). ఆ తండ్రి జీవితంలో ఆ రాత్రి యొక్క చిత్రం బహు శక్తివంతమైన స్వరూపమై ఉంది. అక్కడ మనందరి కొరకు జీవితం జీవించబడింది; వాగ్దానము, నెరవేర్పు అనే రెండింటి మధ్య ఆ రాత్రిని మనం భరించాలి.

ప్రకాశవంతమైన దినపు వెలుగుకంటెను, రాత్రిపూట బాధలు, భయాలు, అధికమైన అపాయకర సూచనలుగా నిలిచియుంటాయి. భయంకరమైన చిత్రాలు ఎల్లప్పుడు చీకటిలోనే చేయబడతాయి. ఎందుకంటే రాత్రులలో మనం భయపెట్టబడతాం. భారమైన సమస్యలు చీకటిలో ఉండేలా నాకు నేను అనుమతించాను. ప్రత్యేకమైన ఒక భారం విషయమై రాత్రులందు ఆందోళన పడుతూ నేను మేల్కొన్నా, లేక నేను నిద్ర పోలేక పోయినట్టయితే, నేను లేచి వంట గదిలోనికి వెళ్లి లైటు వేసికొని, తెరచిన కండ్లతో నేను నా సమస్యలను గూర్చి తీవ్రంగా ఆలోచించుతా!

అతడు యింటికి ఇరవై మైళ్ల దూరంలో ఉన్నందున, ఆ అధికారి నిరీక్షణకు విరోధంగా నిరీక్షించుతూ, తన భయాలతో అతడు పెనుగులాడుతూ ఆ రాత్రి గడిపాడు. మేలు కలుగుతుందనే నమ్మిక ఒక క్షణంలో, చీకటి అనుమానాలతో మరోక్షణంలో అతడు ఊగిసలాడి ఉంటాయని నేను ఆశ్చర్యపోతాను. కనీసం అతని పేరేమో కూడా మనకు తెలియదు. అయితే మనమందరం అతనితో పోల్చుకోవచ్చు. ఎందుకంటే, వాగ్దానము – నెరవేర్పు అనేవాటి మధ్య కలిగే భయాందోళనలు మనకు తెలుసు.

కాన్సర్‌తో దీర్ఘకాలం పోరాటం తరువాత నవంబరు 10, 1994లో క్లాడెట్టే జోన్సు అనే ఒక అద్భుతమైన క్రైస్తవ స్త్రీ చనిపోయింది. ఆమె వ్యాధిని, బాధను ఆశ్చర్యకరమైన ధైర్యంతోను, అరుదైన కృపతోను సహించింది. ఆమె భర్తయైన జెర్రీ, పిల్లలు – వారి స్నేహితులతో సహా ఆమెను ఎన్నడూ కలిసికోని వేలాదిమంది ప్రజలు – ఆమె తన వ్యాధిని, మరణాన్ని ఎదుర్కొన్న ఆశ్చర్యకరమైన విధానాన్ని బట్టి నిజంగా దీవించబడ్డారు. ఆమె మృతి పొందడానికి ఒక వారం ముందుగా, ఆమె తన తల్లియైన – జార్జియా దూ బోయిస్‌తో టెలిఫోనులో మాట్లాడిందట. తాను త్వరలోనే చనిపోతాననే సంగతి తెలిసికొని, క్లాడెట్టే తన తల్లితో యిలాగన్నదట: "నేను మా నాన్న నీ కొరకు వేచియుంటాం." ఆలాటి వాగ్దానం దేవుడు తన పిల్లలైనవారికి చేశాడు. క్లాడెట్టేకు, విశ్వాసము భవిష్య ద్దర్శనంగా మారింది. నిలిచియున్న మనకైతే, వాగ్దానము, నెరవేర్పు అనేవాటి మధ్యనున్న

రాత్రిని భరించుతూ, ఆ వాగ్దానం పరలోకమందు నెరవేరేవరకు వేచి ఉంటాం.

యేసునందలి విశ్వాసమందు మనం ఎదుగుతూ ఉండగా, అక్కర కలిగి ఉన్న ఆ తండ్రి యొక్క అనుభవం మనకు ఆదర్శంగా పని చేస్తుంది. ఈ కథ యొక్క ఆరంభమందు, తన కుమారుని యొక్క ప్రాణం కొరకు విన్నవించుకొనగలిగినంత విశ్వాసము యేసునందు అతనికి ఉంది. అతని విశ్వాసము "నేను పోగొట్టుకొనేది ఏమీ లేదు" అనేలాటి విశ్వాసం. అంతట, అతడు యేసుతో మాట్లాడిన పిమ్మట, "యేసు తనతో చెప్పిన మాటయందు అతడు విశ్వసించాడు" (4:50). చివరిగా, తన కుమారుడు బ్రతికియున్న సంగతి స్వయంగా చూచిన వారినుండి తాను వినగా, "తనకు తానే నమ్మాడు, తన యింటివారును నమ్మారు" (4:53). నిరీక్షణ కోల్పోయిన నిరాశ పరిస్థితిలోనుండి ధైర్యముతో కూడిన నమ్మిక వచ్చేవరకు అతని విశ్వాసంలో అభివృద్ధిని గమనించు. అతడు కనుపరచిన విశ్వాసము కష్టమైనదై, తరచుగా పేరుకొంటూ పోతూ నమ్మిక మీద నమ్మిక కట్టబడుతున్నట్టు కొనసాగింది.

## ముగింపు

యేసు, ప్రధాని అనేవారి మధ్య జరిగిన ఈ సంఘటనను ముగించక ముందు ఒక కడపటి సత్యం నొక్కి చెప్పవలసియుంది. ప్రభువైన యేసు యొక్క వదనంలోనికి స్పష్టంగా చూడమని కోరుతున్నా. అక్కడ నీవు వీక్షించేది, నీ సొంత నిరీక్షణను పురికొల్పి నమ్మికయుంచు దిశకు అది నిన్ను కదిలిస్తూ ఉంటుంది.

మొదటిగా, సత్యం యొక్క రూపాన్ని చూడు. సౌకర్యమైన అబద్ధంతో జీవించడానికి మనలో ఎవనిని యేసు ఒప్పుకోడు అను విషయం ఈ ఎదుర్కోలులో మనకు బయలుపరచ బడింది. మన బాధనుండి విముక్తి పొందడం అనేదానికంటె ఎక్కువ ప్రాముఖ్యమైనది ఉంది: అది దేవునితో మన సంబంధం. క్రైస్తవులంగా, బాధలేని జీవితం అనే మన సమాజం యొక్క తలంపుతో సత్యము కొరకైన మన సమర్పణను కనబడకుండునట్లుగా చేయడానికి అనుమతించరాదు. జీవితం యొక్క లేక ప్రజలందరి యొక్క మహా గొప్ప సమస్య – వారి ఆత్మల రక్షణయే. అన్నివేళల ఈ విషయాన్ని గుర్తుంచుకో; నేను నీవు అంతకంటే ఏమి తక్కువ చేయలేం.

రెండవదిగా, దయగల ముఖాన్ని చూడు. "ఆ వాక్యము శరీరధారియై"నందున, మానవ పరిస్థితులతో తన్ను తాను యేసు గుర్తింపజేసికోగలిగాడు. నిత్యత్వపు సందర్భంలో, దానిలో ఏదో గొప్ప వ్యత్యాసం ఉన్నట్టు అది చూపిస్తుంది. అయితే తన ప్రియులను పోగొట్టుకున్న మానవులు బహుగా దుఃఖిస్తూ ఉంటారు. ఆ బాలుని తండ్రి అనుభవించిన భయంకరమైన దుఃఖాన్ని యేసు గ్రహించినవాడై, అతని కుమారుని బాగుచేయడానికి దయకలిగి ఆయన వెంటనే ప్రత్యుత్తరమిచ్చాడు.

చివరిగా, నిరీక్షణా వదనాన్ని చూడు. మన వ్యాధులన్నిటిని కుదుర్చుతానని యేసు ఎన్నడూ వాగ్దానం చేయలేదు, గాని మనకు స్థలము సిద్ధపరచ వెళ్లుతున్నట్టు మాట యిచ్చాడు (యోహాను 14:2). మనకు ప్రతిదీ సులభ సాధ్యం చేస్తానని ఆయన వాగ్దానం

చేయలేదు కాని, సదాకాలం మనతో ఉంటానని ఆయన మాట యిచ్చాడు (మత్తయి 28:20). ఆయనయందు మన విశ్వాసం నిలుపుకొని జీవితంలో భయానకమైన రాత్రులు కొన్నిసార్లు వచ్చినప్పుడు, ఆయనతో మనం నడుచుకొంటూ వెళ్లాలి. యేసు మన విశ్వాసానికి పాత్రుడని యోహాను ప్రకటించాడు, మనం నమ్ముతున్నాం!

---

సూచనలు

[1]See the map below. [2]2:23, 24; 6:26 చూడు. [3]Henri J. M. Nouwen, *The Wounded Healer* (Garden City, N.Y.: Image Books, 1972), 92-93. [4]"ఏడవ గంట" యూదులు కాలమానం ప్రకారం 1:00 P.M. లేక రోమీయుల కాలమానం ప్రకారం 7:00 P.M.

